సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 25 । జూలై । 2025



పేదలకు ఇళ్లివ్వకుంటే..
దీపావళి నాటికి పేదలకు ఇళ్లు పంపిణీ చేయకుంటే నిరాహార దీక్షకు సిద్ధమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ హెచ్చరించారు.
- 8లో ▸



కులాస్‌పూర్‌లో దొంగల..
మోపాల్ మండలం కులాస్‌పూర్ గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసి ఉన్న 11 ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు.
- 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.0
ఉదయం చల్లనిగాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

చింతలూర్‌లో ఉద్రిక్తత

- రామడుగు ప్రాజెక్టు కుడి కాలువ తూము తవ్విన గ్రామస్తులు
- అడ్డుకున్న స్థానిక గ్రామాల ప్రజలు



జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూర్ గ్రామ శివారులో గల రామడుగు ప్రాజెక్టు కుడి కాలువ తూమును గ్రామస్తులు తవ్వడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ కాలువ నుంచి చింతలూర్, వాడి, పచ్చలనడ్కుడ, చేంగల్, బడా భీంగల్ రైతులకు సాగు నీరు వెళ్తుంది. అయితే చింతలూర్ గ్రామస్తులు తూమును తవ్వడంతో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో కాలువ వద్దకు చేరుకుని తూమును అడ్డుకున్నారు. చింతలూర్ గ్రామస్తులకు ఈపాటికే ఒక తూము ఉందని తెలిపారు. మరో తూము కోసం కాలువ వద్ద తవ్వడం సరికాదన్నారు. ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో సమాచారం అందుకున్న జక్రాన్‌పల్లి ఎస్సై మాలిక్ రహమాన్, ఇరిగేషన్ అధికారులు అక్కడి చేరుకొని రైతులను సముదాయించారు. తూముకు అవసరమైన మంజూరు పత్రాలు లేకపోవడంతో తవ్విన తూమును ఇరిగేషన్ అధికారులు పూడ్చి వేయించారు. నాలుగు గ్రామాల రైతులు శాంతించడంతో గొడవ సద్దుమణిగింది.

లింగాపూర్ వాగు వద్ద రాకపోకల నిలిపివేత



ఇందల్వాయి: ఇందల్వాయి – ధర్పల్లి రోడ్డు మార్గంలోని లింగాపూర్ వాగుపై గురువారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. వాగుపై నూతనంగా నిర్మిస్తున్న వంతెన వద్ద ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులో నీటి ప్రవాహం ఎక్కువైందని, అక్కడ రోడ్డు కూడా సరిగా లేకపోవడంతో నీటి ప్రవాహం తగ్గే వరకు వాహనదారులు, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 'డయల్ యువర్ ఆర్టీసీ' కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆర్ఎం జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను ఫోన్ చేసి తెలపాలని పేర్కొన్నారు.

నిజామాబాద్, ఆర్ఎం	9959226011
ఆర్మూర్ డీఎం	9959226019
బోధన్ డీఎం	9959226001
నిజామాబాద్–1 డీఎం	9959226016
నిజామాబాద్–2 డీఎం	9959226017
బాన్సువాడ డీఎం	9959226020
కామారెడ్డి డీఎం	9959226018

200 మంది టీచర్ల సర్దుబాటు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతోంది. రెండ్రోజులుగా జిల్లా విద్యాశాఖ అధికారులు 200 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. విద్యార్థులు తక్కువగా ఉన్న స్కూళ్లలోని టీచర్లను సమీప పాఠశాలకు సర్దుబాటు చేశారు. కాగా, 12 మంది ఉపాధ్యాయులు సర్దుబాటులో అనారోగ్య కారణాలతో రిపోర్ట్ చేయలేదు. వీరిని యథాస్థానంలో ఉంచి, ఇతరులకు అవకాశం ఇవ్వాలనే యోచనలో ఉన్నట్లు తెలిసింది. సర్దుబాటు ప్రక్రియను సక్రమంగా నిర్వహించినట్లు డీఈవో అశోక్ తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

నిజామాబాద్‌అర్బన్: ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ కేంద్రాలు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లో ఉచితంగా అడ్మిషన్ పొందాలని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు ప్రభుత్వ ఐటీఐలు, మూడు ఏటీసీలు, మూడు ప్రైవేటు ఐటీఐలలో అడ్మిషన్లకు అవకాశం ఉందని తెలిపారు. వివరాలకు 99481 95654 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.



వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ సహకార సంఘం వద్ద యూరియా కోసం వేచి ఉన్న రైతులు

వచ్చిన బస్తాలు వచ్చినట్లుగా!

ఇప్పటి వరకు సాగైన ప్రధాన పంటలు.. (ఎకరాల్లో)

వరి	మొక్కజొన్న	సోయా	పసుపు	పత్తి	కంది
3,56,001	47,010	32,343	22,804	876	559

జిల్లాలో జోరుగా యూరియా విక్రయాలు

- గతంతో పోలిస్తే భారీగా వినియోగం
- మూడు డోసుల బస్తాలను ఒకేసారి తీసుకెళ్తున్న రైతులు
- పక్కదారి పడుతోందని అధికారుల అనుమానాలు
- యూరియా వినియోగించే పరిశ్రమల్లో తనిఖీలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా యూరియా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సహకార సంఘాలకు వచ్చిన బస్తాలను వచ్చినట్లుగా రైతులు తీసుకెళ్తుండడంతో గోదాములు వేగంగా ఖాళీ అవుతున్నాయి. యూరియా కొరత ఏర్పడుతుందేమోనని పంటలకు అవసరమయ్యే మూడు డోసుల బస్తాలను రైతులు ఒకేసారి తీసుకెళ్లి నిల్వ చేసుకుంటున్నారు. దీంతో రైతులందరికీ ఒకే సమయానికి అవసరమైన యూరియా అందడం లేదు. మళ్లీ యూరియా రావడానికి నాలుగైదు రోజుల సమయం పడుతుండడంతో సొసైటీల చైర్మన్లు, వ్యవసాయ అధికారులకు రైతులు ఫోన్లు చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

రసాయన ఎరువుల వాడకాన్ని క్రమంగా తగ్గించాలని.. తగ్గిస్తేనే పర్యావరణ పరిరక్షణతోపాటు భూసారం పెరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. వ్యవసాయ అధికారులు సైతం అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు పట్టించుకోకుండా పంటలకు విచ్చలవిడిగా యూరియా వేస్తున్నారు. వాస్తవానికి వరి, మక్క పంటలకు ఎకరానికి రెండు బస్తాల యూరియా సరిపోతుంది. కానీ ఐదారు బస్తాల వరకు యూరియా చల్లుతున్నారు. దీంతో యూరియా వినియోగం గణనీయంగా పెరిగిపోతోంది.

అధికారుల అనుమానాలు..

రాష్ట్రంలో, జిల్లాలో యూరియా అమ్మకాలను చూసి వ్యవసాయ శాఖ అధికారులు ఆశ్చర్యపోతున్నారు. రైతులు ఎందుకింత భారీగా యూరియాను కొనుగోలు చేస్తున్నారు? యూరియా ఏమైనా దారి మళ్లుతోందా? రాయితీపై అందించే యూరియాను పరిశ్రమల్లో వినియోగిస్తున్నారా? అనే అనుమానాలను అధికారులు వ్యక్తం చేస్తున్నారు. యూరియా అమ్మకాల పరిశీలనకు జిల్లాకు రాష్ట్ర శాఖ నుంచి ఒక అధికారిని సైతం నియమించారు. ఆ అధికారి జిల్లాలో విడతలవారీగా తనిఖీలు చేపడుతున్నారు. ఇటు వ్యవసాయ, పోలీసు, రెవెన్యూ అధికారులు సైతం బృందాలుగా ఏర్పడి జిల్లాలోని పరిశ్రమల్లో తనిఖీలు చేపడుతున్నారు.

జిల్లాలో యూరియా అమ్మకాలపై కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి యూరియా విక్రయాలు, నిల్వలను పరిశీలిస్తున్నారు. వ్యవసాయ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. జిల్లాలో యూరియా కొరత లేదని, మూడు డోసులు ఒకేసారి తీసుకెళ్లడంతో మిగతా రైతులకు సమయానికి దొరకక కొరత ఉన్నట్లుగా కనిపిస్తోందని డీఏవో గోవింద్ 'సాక్షి'కి తెలిపారు.

8వేల మెట్రిక్ టన్నులు అధికం..

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు 8వేల మెట్రిక్ టన్నుల యూరియా ఎక్కువగా అమ్ముడైందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నెలవారీగా మాత్రమే జిల్లాకు కోటా వస్తుండడంతో సర్దుబాటు చేయడం కష్టంగా మారిందని పరేషాన్ అవుతున్నారు. ఈ వానాకాలం సీజన్‌కు మొత్తం 75వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని ప్రభుత్వానికి జిల్లా నుంచి ఇండెంట్ పంపించారు. ఇప్పటి వరకు 51వేల మెట్రిక్ టన్నులు రాగా, 46,411 మెట్రిక్ టన్నులు అమ్ముడుపోయింది.

ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.438 కోట్లు

- 'హ్యామ్' విధానంలో ఉమ్మడి జిల్లాలో పనులు
- 362.83 కిలోమీటర్ల మేర అత్యవసర పనులకు నిధుల కేటాయింపు



నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా (నిజామాబాద్, కామారెడ్డి) పరిధిలో 362.83 కిలోమీటర్ల మేర 24 రోడ్ల పనులకు ప్రభుత్వం రూ.438.54 కోట్లు కేటాయించింది. ఇందుకు సంబంధించిన పనులను ఆర్ అండ్ బీ పరిధిలో చేపట్టేందుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్(హ్యామ్) విధానంలో పనులు చేపట్టనున్నారు.

నూతన విధానమిదే..

గతంలో రోడ్లను ఈపీసీ (ఇంజినీరింగ్ – ప్రొక్యూర్‌మెంట్–కన్‌స్ట్రక్షన్) లేదా బీవోటీ (బిల్డ్ – ఆపరేట్ – ట్రాన్స్‌ఫర్) విధానాల్లో చేపట్టేవారు. ఈపీసీ విధానంలో పనులు చేపడితే ప్రభుత్వం ఒకేసారి భారం పడగా, బీవోటీ విధానంలో కాంట్రాక్ట్ సంస్థనే మొత్తం నిధులను భరించాల్సి వచ్చేది. బీవోటీ విధానంలో రోడ్లను నిర్మించిన కాంట్రాక్ట్ సంస్థ టోల్ గేట్లను ఏర్పాటు చేసుకుని రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన మొత్తాన్ని రాబట్టుకునేది. అయితే ప్రభుత్వం, ప్రజలకు భారం తప్పేలా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్) విధానంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. రోడ్డు కాంట్రాక్ట్ దక్కించుకున్న సంస్థకు ప్రభుత్వం ముందుగా 40శాతం నిధులు అందిస్తుంది. మిగతా 60శాతం నిధులను సదరు కాంట్రాక్ట్ సంస్థనే భరిస్తూ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. కాంట్రాక్ట్ సంస్థలు రోడ్ల నిర్మాణానికి వెచ్చించిన 60శాతం నిధులను ప్రభుత్వం 15 ఏళ్లపాటు ఏటా కొంత చొప్పున వడ్డీతో పాటు చెల్లిస్తుంది. అయితే రోడ్ల నిర్వహణ బాధ్యత 15ఏళ్లపాటు కాంట్రాక్టర్‌దే. నూతనంగా తీసుకొచ్చిన హ్యామ్ విధానంలో గ్రామీణ రోడ్ల నిర్మాణం, విస్తరణ చేపట్టాలనే నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అత్యవసరం ఉన్న రోడ్లే..

ఉమ్మడి జిల్లా(కామారెడ్డి, నిజామాబాద్)లో అవసరం ఉన్న చోట్ల నూతన రోడ్ల నిర్మాణం, విస్తరణ చేపట్టనున్నారు. ఇప్పటికే 24 రోడ్లకు సంబంధించిన పనులను మొదటి ఫేజ్‌లో చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1438 కి.మీ, కామారెడ్డి జిల్లాలో 830 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. గ్రామీణ రోడ్లు, గ్రామాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే, ఓ మండలం నుంచి మరో మండలానికి, మండలాల నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్ల పనులను ప్రాధాన్యతను బట్టి, ప్రజలకు అత్యంత అవసరం ఉన్న ప్రాంతాల్లో పనులను పకడ్బందీగా చేపట్టనున్నారు.



రాళ్లలో రతనాల సేద్యం

ఎటూ చూసినా రాళ్లే.. ఎందుకూ పనికి రాని బీడు భూములే..అలాంటి భూముల్లో రతనాల సేద్యం చేస్తున్నారు. రాళ్ల నడుమ పంటలు పండించి లాభాలు ఆర్జిస్తున్నారు. మోపాల్ మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన ఎల్లమ్మకుంట తండా శివారులోని రాళ్ల భూమిలో సాగవుతున్న మొక్కజొన్నను 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

మహిళలకు వడ్డీ వాపస్

- జిల్లాకు రూ.21.69 కోట్లు విడుదల
- ఎస్‌హెచ్‌జీల ఖాతాల్లో నిధులు జమ



డొంకేశ్వర్(ఆర్మూర్): స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం 'వడ్డీ' కానుక అందజేసింది. ఐకేపీలో బ్యాంకు లింకేజీ రుణాలు పొంది వడ్డీతో కలిపి సక్రమంగా వాయిదాలు చెల్లించిన వారికి వడ్డీ డబ్బులను వాపస్ చేసింది. జిల్లాలోని 20,547 ఎస్‌హెచ్‌జీలకు రూ.21.69 కోట్లు విడుదల చేసింది. ఇవి 2024–25 ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్, మే, జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన వడ్డీ డబ్బులని సంబంధిత అధికారులు వెల్లడించారు. నిధులను మండలాల వారీగా సంఘాల ఖాతాల్లో జమ చేశారు. సంఘం ఖాతాల నుంచి సభ్యురాలి వారీగా వడ్డీ డబ్బులను పంచుకోనున్నారు. అత్యధికంగా నందిపేట్ మండలానికి రూ.1.32 కోట్లు, నవీపేట్ మండలానికి రూ.1.24కోట్ల వడ్డీ వాపస్ వచ్చింది. చాలా రోజుల తర్వాత వడ్డీ వాపస్ రావడంతో జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

మండలాల వారీగా వాపస్ వచ్చిన వడ్డీ డబ్బులు

మండలం	సంఘాలు	రూ.కోట్లలో
ఆర్మూర్	948	1.16
మాక్లూర్	1,088	1.05
నందిపేట్	1,220	1.32
బాల్కొండ	606	0.69
భీమ్‌గల్	976	1.15
కమ్మర్‌పల్లి	845	1.06
మెండోరా	497	0.52
మోర్తాడ్	666	0.62
ముప్కాల్	411	0.52
వేల్పూర్	960	1.16
ఏర్గట్ల	335	0.37
చందూర్	188	0.15
కోటగిరి	893	0.93
మోస్రా	267	0.25
రుద్రూర్	416	0.41
వర్ని	554	0.49
బోధన్	1,189	1.22
నవీపేట్	1,145	1.24
రెంజల్	708	0.61
ఎడపల్లి	854	0.85
ధర్పల్లి	809	0.82
డిచ్‌పల్లి	1,187	0.59
ఇందల్వాయి	682	0.59
జక్రాన్‌పల్లి	828	0.98
మోపాల్	760	0.78
నిజామాబాద్‌రూరల్	571	0.62
సిరికొండ	944	0.96

రేషన్‌కార్డులకు 'స్థానిక' భయం!

- ఎన్నికల కోడ్‌పై సర్వత్రా చర్చ
- దరఖాస్తుదారుల్లో మొదలైన ఆందోళన
- తహసీల్, డీఎస్‌వో కార్యాలయాలకు పరుగులు
- కోడ్‌పై స్పష్టత లేదంటున్న అధికారులు



సుభాష్‌నగర్: అర్హులందరికీ రేషన్‌కార్డులు అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో పేదల్లో సంతోషం ఎంతోకాలం నిలిచేలా లేదు. కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న పేదలకు స్థానిక సంస్థల ఎన్నికల భయం పట్టుకుంది. ఎన్నికల కోడ్ రూపంలో అడ్డుతగిలేలా ఉందనే చర్చ దరఖాస్తుదారుల్లో జోరుగా సాగుతోంది. జిల్లాలో 4,05,310 రేషన్ కార్డులు ఉన్నాయి. అందులో అంత్యోదయ కార్డులు 20,910, అన్నపూర్ణ కార్డులు 1,016 పోను మిగతా 3,83,384 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. గత జనవరి నుంచి ఇప్పటి వరకు 3,501 కొత్తకార్డులు మంజూరయ్యాయి. 1.19 లక్షల మంది పేర్లు కొత్తగా కార్డుల్లో చేరాయి. కాగా, రేషన్‌కార్డుల కోసం 39వేల వరకు దరఖాస్తులు రాగా, 20వేలకు పైగా దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల మీ సేవ కేంద్రాల్లో కార్డుల కోసం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు రావడంతో పది రోజులపాటు వెబ్‌సైట్‌ను బంద్ ఉంచారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో తహసీల్దార్ కుణ్ణంగా పరిశీలించిన తర్వాతే డీఎస్‌వో లాగిన్‌కు ఫార్వార్డ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో దరఖాస్తులపై రీసర్వే చేసి, నిబంధనల ప్రకారం ఉంటేనే డీఎస్‌వో లాగిన్‌కు ఫార్వార్డ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే రిజెక్ట్ చేస్తున్నారు.

కోడ్ వర్తిస్తుందా?

రేషన్‌కార్డుల దరఖాస్తు, మంజూరు నిరంతర ప్రక్రియ అంటూ ప్రభుత్వ పెద్దలు ఒకవైపు ప్రకటనలు చేస్తున్నా.. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల కోడ్‌తో దరఖాస్తుల మంజూరు నిలిచిపోనుందా అనే చర్చ జోరందుకుంది. రేషన్‌కార్డుల మంజూరుకు స్థానిక సంస్థల కోడ్ వర్తిస్తుందా? లేదా? అనే దానిపై అటు అధికార వర్గాల్లో, ఇటు ప్రభుత్వ పెద్దల నుంచి స్పష్టత కరువైంది. దీంతో గాబరా పడుతున్న దరఖాస్తుదారులు తహసీల్, డీఎస్‌వో కార్యాలయాలకు తరలివస్తున్నారు.

స్పష్టత లేదు..



రేషన్‌కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను వారం రోజుల్లోగా మంజూరు చేస్తున్నాం. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కార్డుల మంజూరుకు వర్తిస్తుందా? లేదా అనేది స్పష్టత లేదు. ప్రభుత్వ పరిధిలోని అంశం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ముందుకు సాగుతాం.

– అరవింద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- సిరికొండలో ఆకస్మిక తనిఖీలు



ప్రభుత్వాసుపత్రిలో సిబ్బందికి ఆదేశాలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సిరికొండ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సిరికొండ మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ హాజరుపట్టిక ప్రకారం వైద్యాధికారి, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచాలని, గ్రామాలలో విరివిగా వైద్య శిబిరాలను ఏర్పాటు చే యాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం కోసం వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. మౌలిక వసతులు అవసరమైతే అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రతిపాదనలు పంపాలని ఎంఈవో రాములు, హెచ్ఎంలు సతీశ్, నరేశ్‌లకు సూచించారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు వచ్చాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ తోడ్పాటుతో విద్యార్థులకు ఐడీ కార్డులు, క్రీడా దుస్తులు సమకూర్చడంపై కలెక్టర్ అభినందించారు. తహసీల్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తులపై ఆరా తీశారు. రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిర్ణీత గడువులోగా అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. కొత్త రేషన్‌కార్డులు, పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెనువెంటనే పరిశీలించి అర్హులకు ఆమోదం తెలపాలన్నారు. ఎల్ఆర్ఎస్ కింద నిర్ణీత రుసుము చెల్లించిన దరఖాస్తుదారులకు సత్వరమే ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. పీఏసీఎస్ గోదామును తనిఖీ చేసి ఎరువులను పరిశీలించారు. ఎరువులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ రావు ఉన్నారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

- కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేస్తూ, లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 51 లక్షల పైబడి మొక్కలు నాటేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయనే వాతావరణ శాఖ చేసిన సూచనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా అవగాహన కల్పించాలన్నారు. లబ్ధిదారులకు ఐకేపీ, మెప్మా ద్వారా రుణాలు మంజూరయ్యేలా చూడాలన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు పోషణ్ కిట్లు అందించేలా చొరవ చూపాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న పాఠశాల, అంగన్‌వాడీ, పీహెచ్‌సీల భవనాలను త్వరితగతిన పూర్తి చేసి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్‌: స్వచ్ఛంద, కార్పొరేట్‌ సంస్థలు క్షయ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలని కలెక్టర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో గురువారం 'టిబి ముక్త్‌ భారత్‌ అభియాన్‌'లో భాగంగా టిబి రోగులకు కిట్స్‌ ఇచ్చిన దాతలను కలెక్టర్‌ సన్మానించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లేని నిజామాబాద్‌ నిర్మాణానికి అందరి సహకారం అవసరమన్నారు. అడిషనల్‌ కలెక్టర్లు అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, ట్రెయినీ కలెక్టర్‌ కరోలియన్‌ చింగ్‌తోని మావి, డీఎంహెచ్‌వో రాజశ్రీ, టిబి అధికారిణి అవంతి, కోఆర్డినేటర్లు రవిగౌడ్‌, లక్ష్మణ్‌, నిజామాబాద్‌ రైస్‌ మిల్లర్‌ అసోసియేషన్‌, ఎల్‌పీజీ గ్యాస్‌ అసోసియేషన్‌, సూర్య హెల్త్‌ ఆర్గనైజెషన్‌, రెడ్‌ క్రాస్‌ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లో లైబ్రరీ పీరియడ్‌

- ప్రతి రోజు 45 నిమిషాలు కేటాయింపు
- జిల్లాలోని 383 పాఠశాలల్లో అందుబాటులో గ్రంథాలయాలు
- పఠనాసక్తి పెంపొందించడమే లక్ష్యం
- రిసోర్స్‌ పర్సన్లకు కొనసాగుతున్న శిక్షణ



డైట్‌ కళాశాలలో గ్రంథాలయం నిర్వహణపై కొనసాగుతున్న శిక్షణలో పాల్గొన్న టీచర్లు

నిజామాబాద్‌అర్బన్‌: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని 252 హైస్కూళ్లు, 131 ప్రాథమికోన్నత పాఠశాలలకు వివిధ రకాల పుస్తకాలను సరఫరా చేసింది. దీంతో ప్రతిరోజు గ్రంథాలయ పీరియడ్‌ నిర్వహిస్తూ విద్యార్థులను బాల సాహిత్యానికి చేరువ చేయనున్నారు. అలాగే పిల్లల్లో పఠనాసక్తిని పెంపొందిచనున్నారు.

నిర్వహణపై శిక్షణ

ఒక్కో పాఠశాలకు సమగ్ర శిక్ష అభియాన్‌ 150 పుస్తకాలు, రూమ్‌ టు రీడ్‌ సంస్థ 250 వరకు కథల పుస్తకాలను సరఫరా చేసింది. విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా రంగురంగుల బొమ్మలతో కూడినవి, నైతిక విలువలు పెంపొందించేవి, నీతి కథలు, నాయకుల జీవిత చరిత్రలు గల పుస్తకాలు ఉన్నాయి. కాగా, గ్రంథాలయాల నిర్వహణపై రిసోర్స్‌ పర్సన్‌లకు శిక్షణ ఇస్తున్నారు. వారు ఈ నెల 28, 29 తేదీలలో జరగనున్న కాంప్లెక్స్‌ సమావేశాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

రీడింగ్‌ కార్నర్‌లు..

గ్రంథాలయాల ఏర్పాటుతో పిల్లల్లో అభ్యసన స్థాయి మెరుగుపడుతున్నట్లు ఇటీవల ప్రకటించిన న్యాస్‌ ఫలితాలతో వెల్లడైంది. దీనిని దృష్టిలో పెట్టుకొని పఠన సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రతిరోజు లైబ్రరీ పీరియడ్‌ అమలయ్యేలా అధికారులు పర్యవేక్షించనున్నారు. అలాగే విద్యార్థులు ఉత్సాహంగా, స్వేచ్ఛగా చదివేలా పాఠశాలలో 45 నిమిషాలు కేటాయించనున్నారు. అందుకు ప్రతి తరగతి గదిలో రీడింగ్‌ కార్నర్‌లను ఏర్పాటు చేస్తున్నారు. వారంలో రెండుసార్లు పిల్లలకు కథల పుస్తకాలను ఇంటికి ఇచ్చి చదివే అలవాటును ప్రోత్సహించనున్నారు.

చదవడం అలవాటుగా మారుతుంది



ప్రపంచీకరణ నేపథ్యంలో పిల్లలు సెల్‌ఫోన్‌లకు ఆకర్షితులవుతున్నారు. ఈ దురాలవాటును మాన్పించడానికి పిల్లలు పుస్తకాలను చదివేలా లైబ్రరీ నిర్వహణ ఎంతగానో ఉపయోగపడుతుంది.

– ప్రసన్న కుమార్‌, రిసోర్స్‌ పర్సన్‌

పఠన శక్తి పెరుగుతుంది



ప్రభుత్వ బడులకు సరఫరా చేసిన కథల పుస్తకాలు బాగున్నాయి. ఆకర్షణీయంగా ఉండడంతో పిల్లలు చదివేందుకు ఆసక్తి చూపుతారు. దీంతో పిల్లల్లో పఠన శక్తి పెరుగుతుంది.

– అశోక్‌, డీఈవో

అరుదైన జానపద నృత్య రూపకం 'చిందు'

మీకు తెలుసా?



1986లో ఢిల్లీలో అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ దంపతులతో జిల్లా చిందు కళాకారులు (ఫైల్‌)

ఆర్మూర్‌: అరుదైన జానపద నృత్యరీతిగా గుర్తింపు తెచ్చుకున్న చిందులు మన తెలంగాణలోనే కనబడతారు. కొన్నేళ్ల కిందట ఈ కళను నమ్ముకొని నిజామాబాద్‌, కరీంనగర్‌, మెదక్‌, ఆదిలాబాద్‌, వరంగల్‌, నల్గొండ జిల్లాల్లో సుమారు ఐదువేల కుటుంబాలు జీవనం సాగించేవి. ఒక్క ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోనే ఆర్మూర్‌, భీమ్‌గల్‌, బాల్కొండ, బోధన్‌, బాన్సువాడ ప్రాంతాలలో రెండు వేల మంది కళాకారులు ఉండేవారని అంచనా.

- హరిజనులలో ఒక తెగ అయిన మాదిగ వారిని అడుక్కోవడానికి చిందులు వేసేవారే ఈ చిందు కళాకారులు లేదా చిందు మాదిగలు.
- వీరు ప్రదర్శించే యక్షగానం పేరే చిందు భాగోతం లేదా చిందు భాగవతం.
- చిందు కళాకారుల రామాయణ, మహాభారత, భాగవతాలలో ప్రధాన ఘట్టాలను రంగస్థలంపై ప్రదర్శించేవారు.
- ప్రస్తుతం రంగస్థల ప్రదర్శనలు కనుమరుగుకావడంతో, వారు చిందు ప్రదర్శనలను తగ్గించారు.

పాత ఫోన్లు కొనేటప్పుడు జాగ్రత్త..

సమాచారం..

ఖలీల్‌వాడి: తక్కువ రేటుకు మంచి సెల్‌ ఫోన్లు వస్తున్నాయని చాలా మంది పాతవి కొనుగోలు చేస్తుంటారు. కానీ ఈ ఫోన్లు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోకుంటే ఇబ్బందుల్లో పడక తప్పదు. ప్రతి సెల్‌ఫోన్‌కు ఐఎంఈఐ నెంబర్‌ ఉంటుంది. గతంలో ఏదైనా నేరాలకు పాల్పడిన వారు ఫోన్‌ను విక్రయిస్తే, కొనుగోలు చేసినవారు ఇబ్బందులు పడతారు. అలాగే కొందరు సెల్‌ఫోన్లను చోరీ చేసి తక్కువ ధరకు అమ్ముతుంటారు. వీటిని కొన్న తర్వాత పోలీసు సమస్యలు రావచ్చు. ఎప్పుడైనా పాత ఫోన్‌ కొనేటప్పుడు వారి పూర్తి వివరాలు, చిరునామా తీసుకోవాలి. అలాగే లిఖిత పూర్వకంగా పత్రం రాసుకొని తీసుకుంటే కొంత మేర ఇబ్బందులు తప్పే అవకాశాలు ఉంటాయి.

పిల్లలు లేని వారికి వరం ఐవీఎఫ్‌

- అందుబాటులో సులువైన చికిత్స
- సహజ, ఐవీఎఫ్‌ పిల్లలకు తేడా లేదు
- నేడు అంతర్జాతీయ ఐవీఎఫ్‌ దినోత్సవం



నిజామాబాద్‌ నాగారం: సంతానలేమితో బాధపడుతున్న వారికి ఐవీఎఫ్‌ (ఇన్‌ విట్రో ఫెర్టిలైజేషన్‌) ఓ వరంలా మారింది. పిల్లలు లేరనే నిరాశలో ఉన్న వారి జీవితాల్లోకి ఫెర్టిలిటీ సెంటర్లు కొత్త వెలుగులు తీసుకొస్తున్నాయి. సులువైన చికిత్స అందుబాటులో ఉండడంతో చాలా జంటలు ఐవీఎఫ్‌పై నమ్మకంతో వెళ్తున్నారు. నేడు అంతర్జాతీయ ఐవీఎఫ్‌ సందర్భంగా కథనం..

ఐవీఎఫ్‌ పద్ధతిలో అంటే ఆడవారి అండాలను మగవారి వీర్యకణాలు కలిపితే వచ్చే పిండాలను గర్భసంచిలో ప్రవేశపెడతారు. ఈ పద్ధతిలో మునుపు రెండు లేక మూడు పిండాలను ప్రవేశపెట్టేవారు. అందువల్ల ఐవీఎఫ్‌ కవలలు పుట్టే అవకాశం పెరుగుతుంది. కానీ ఇప్పుడు పెరుగుతున్న టెక్నాలజీతో గర్భం దాల్చే అవకాశాలు మెరుగయ్యాయి. ఆడవారు 10 నుంచి 12 రోజులపాటు ఐవీఎఫ్‌ ఇంజక్షన్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ఆడవారి శరీరంలో ఉండే అండాలను బయటకు తీసి మగవారి వీర్యకణాలతో కలుపుతారు. అలా పెరిగిన దాన్ని ఆడవారి గర్భసంచిలో ప్రవేశపెడతారు. ఇవన్నీ కూడా డేకేర్‌ ప్రొసీజర్స్‌ అంటే అదే రోజు ఇంటికి వెళ్లొచ్చు. ఐవీఎఫ్‌లో నొప్పి అనేది చాలా తక్కువ. ఐవీఎఫ్‌ ద్వారా గర్భం దాల్చిన వారికి వైద్యులు ఒక రెండు నెలలు జాగ్రత్తలు చెబుతారు. ఆ తర్వాత సహజ ప్రెగ్నెన్సీలాగే అన్ని పనులు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు చేసిన రిసెర్చ్‌, ఆర్టికల్స్‌ ఆధారంగా సహజంగా గర్భం ద్వారా పుట్టిన పిల్లలకి, ఐవీఎఫ్‌ ద్వారా పుట్టిన పిల్లలకి ఎటువంటి తేడా లేదని తేలింది.

నార్మల్‌ డెలివరీ చేసుకోవచ్చు



ఐవీఎఫ్‌ ద్వారా గర్భం దాల్చిన వారు నార్మల్‌ డెలివరీ చేయించుకోవచ్చు. వేరే ఇతర కారణాల వల్ల సిజేరియన్‌ చేయించాల్సిన పరిస్థితి రావొచ్చు. జిల్లాలో చాలా మంది సంతానం లేక ఇబ్బందులు పడుతున్నారు. డాక్టర్లతో మాట్లాడి అనుమానాలను నివృత్తి చేసుకోవాలి.

–అర్చన, పినాకిల్‌ ఐవీఎఫ్‌ ఫెర్టిలిటీ సెంటర్‌ వైద్యురాలు



లక్ష్యాల సాధన నిరంతర ప్రక్రియ





సదస్సులో మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి.. పాల్గొన్న అధ్యాపకులు, పత్ర సమర్పకులు

తెయూ(డిచ్‌పల్లి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన నిరంతర ప్రక్రియ అని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ యాదగిరి సూచించారు. తెయూలో అర్థ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎంపవరింగ్‌ ఇండియా–2047: స్ట్రాటజీస్‌ ఫర్‌ సస్టెయినబుల్‌ డెవలప్‌మెంట్‌' అనే అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రిజిస్ట్రార్‌ హాజరై ప్రసంగించారు. 2002లో దక్షిణాఫ్రికాలో జరిగిన ప్రపంచ సుస్థిరాభివృద్ధి సదస్సులో ప్రపంచ దేశాల స్నేహపూర్వక సంబంధాలతో సుస్థిర అభివృద్ధి సాధించాలని నిర్ధారించుకున్నట్లు తెలిపారు. జనవరి 2015లో 2030 నాటికి సాధించాల్సిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను ప్రకటించడమైందన్నారు. జాతీయ సదస్సును విజయవంతంగా పూర్తి చేసిన డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ అప్లయిడ్‌ ఎకనామిక్స్‌ విభాగాధిపతి, సదస్సు కన్వీనర్‌ పున్నయ్య, కో కన్వీనర్‌ సంపత్‌ కుమార్‌, అధ్యాపకులు, విద్యార్థులను రిజిస్ట్రార్‌ ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్‌ కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు రాణిరత్న ప్రభ, చిట్టెడు కృష్ణారెడ్డి, అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ ఆచార్యులు కృష్ణారెడ్డి ప్రసంగించారు. ప్రొఫెసర్‌ రవీందర్‌రెడ్డి, నాగరాజు, స్వప్న, వర్సిటీ అధ్యాపకులు, పత్ర సమర్పకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్‌ కృషి ఫలితమే 'కొత్త రైల్వేలైన్‌'



దినేష్‌ పటేల్‌ కులాచారి (ఫైల్‌)

సుభాష్‌నగర్‌: ఆర్మూర్‌ మీదుగా ఆదిలాబాద్‌–పటాన్‌చెరు మధ్య కొత్త రైల్వేలైన్‌ ప్రాజెక్టు ఎంపీ అర్వింద్‌ ధర్మపురి కృషికి ఫలితమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌ పటేల్‌ కులాచారి ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్లుగా ఎంపీ అర్వింద్‌ ఈ రైల్వేలైన్‌ ప్రాజెక్టు మంజూరు కోసం రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేశారన్నారు. 250 కిలోమీటర్ల పొడవైన ఈ నూతన రైలు మార్గం నిర్మల్‌, నిజామాబాద్‌, బోధన్‌, సంగారెడ్డి వంటి కీలక ప్రాంతాలను కలుపుతుందన్నారు. పటాన్‌చెరు, సంగారెడ్డి ప్రాంతాల్లో అధిక సంఖ్యలో పరిశ్రమలు ఉన్నందున పారిశ్రామిక, వ్యవసాయ, వాణిజ్య రంగాల అభివృద్ధికి ఈ లైన్‌ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైల్వేలైన్‌ను మంజూరు చేసిన రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌, చొరవ తీసుకున్న ఎంపీ అర్వింద్‌ ధర్మపురికి జిల్లా ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

ఫంక్షన్‌హాల్‌ గేటు కూల్చివేత



డిచ్‌పల్లి: మండల కేంద్రం శివారులోని జీ కన్వెన్షన్‌ ఫంక్షన్‌హాల్‌ మెయిన్‌ గేటును గురువారం మధ్యాహ్నం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారు. సమచారం అందుకున్న డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. జీ కన్వెన్షన్‌ యజమానులు కొందరి వద్ద అప్పులు చేసి నష్టాలపాలు కావడంతో ఐపీ పెట్టారు. ఏడాదిన్నర కాలం గడిచినా బాధితులకు డబ్బులు ముట్టకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీ తీసుకెళ్లి కన్వెన్షన్‌ గేటును కూల్చివేయడంతోపాటు లోనికి వెళ్లకుండా గేటు ముందు గుంత తవ్వి వెళ్లిపోయారు. ఈఘటనపై కన్వెన్షన్‌ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వకుంటే నిరాహార దీక్ష చేస్తా

- నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లు, డబుల్‌బెడ్‌ రూం ఇళ్లు దీపావళి నాటికి అందించాలి
- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతోపాటు డబుల్‌ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేసి దీపావళి నాటికి పంపిణీ చేయాలని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ డెడ్‌లైన్‌ ప్రకటించారు. లేకుంటే పేదలతో కలిసి ధర్నా, నిరాహార దీక్షకు సిద్ధమన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది దసరా నాటికే ఇళ్లను ఇస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారని, కానీ ఏడాది కావస్తున్నా ఇళ్లకు మోక్షం లభించలేదన్నారు. జాగా ఉన్న వారికే ఇందిరమ్మ ఇళ్లు అని ప్రభుత్వం ప్రకటించిందని, అర్బన్‌ ఏరియాలో కార్మికులు, ఆటోడ్రైవర్లకు గజం జాగా కొనే స్థోమత ఉందా అని ప్రశ్నించారు. రెండో విడతలో జాగా లేని అర్హులకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్‌చేశారు. 80శాతం పూర్తయిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పీఎం ఆవాస్‌ యోజన కింద కేంద్రం వాటా ఇస్తోందని, ఇళ్లపై ప్రధానమంత్రి పేరు, ఫొటో పెట్టాలని డిమాండ్‌చేశారు. నాయకులు, మాజీ కార్పొరేటర్లు గోపిడి స్రవంతిరెడ్డి, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్‌, మాస్టర్‌ శంకర్‌, నాగరాజు, తారక్‌ వేణు, పల్నాటి కార్తీక్‌, పంచరెడ్డి శ్రీధర్‌, కిషోర్‌, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక ఏపీఎంల బదిలీలు

- షెడ్యూల్‌ విడుదల
- నేడు కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్‌

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్‌)లో డీపీఎంల వరకు జరిగి నిలిచిన బదిలీలు తిరిగి మొదలయ్యాయి. నెల రోజులుగా ఎదురు చూస్తున్న ఏపీఎంలకు బదిలీల షెడ్యూల్‌ విడుదలైంది. జిల్లాకు ఏపీఎంలను కేటాయించిన సెర్ప్‌ ఉన్నతాధికారులు వారి సీనియారిటీ లిస్టును సైతం పంపించారు. బుధ, గురువారాల్లో ఆప్షన్లు రాసి జిల్లా కార్యాలయంలో అందజేశారు. మొత్తం 31 మంది ఏపీఎంల బదిలీలకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నారు. కౌన్సెలింగ్‌లో కోరుకున్న మండలాలను కేటాయించి 26న పోస్టింగ్‌ ఆర్డర్లు ఇవ్వనున్నారు. 31న పాత మండలాల నుంచి రిలీవ్‌ అయ్యి ఆగస్టు 1న కొత్తగా పోస్టింగ్‌ ఇచ్చిన మండలాల్లో రిపోర్టు చేయాలని సెర్ప్‌ నుంచి ఆదేశాలున్నాయి. ఐతే, ఏపీఎంలలో కొందరు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లాలనే పట్టుదలతో పైరవీలు సైతం చేసినట్లు వినిపిస్తున్నాయి.

సీసీలు, ఇతర సిబ్బందికి కూడా వెంటనే..

ఏపీఎంల బదిలీలు, కొత్త మండలాల్లో పోస్టింగ్‌ల ప్రక్రియ నెలాఖరుతో ముగియనుంది. అనంతరం సీసీలు, ఇతర సిబ్బందికి కూడా వెంటనే బదిలీలు చేపట్టాలని సెర్ప్‌ ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు నాలుగైదు రోజుల్లో షెడ్యూల్‌ విడుదల చేసే అవకాశమున్నట్లు ఉద్యోగవర్గాలు పేర్కొంటున్నాయి. సీసీలు, ఇతర సిబ్బంది ఇది వరకే ఆప్షన్లు పెట్టుకోగా కౌన్సెలింగ్‌ చేయడమే ఆలస్యమంటున్నారు.

సమగ్ర శిక్షలో బదిలీలకు గ్రీన్‌సిగ్నల్‌..

ఆర్మూర్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సమగ్ర శిక్షలో ఎట్టకేలకు బదిలీల పర్వం ప్రారంభమైంది. భార్య, భర్తలు ఉద్యోగులుగా ఉన్న పక్షంలో వారిలో ఒకరిని బదిలీ చేయడానికి, మ్యూచ్‌వల్‌ అండర్‌ స్టాండింగ్‌తో బదిలీలకు అనుమతినిస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్‌ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంతో భార్యభర్తలు ఇతర జిల్లాల్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్న వారికి సమస్య పరిష్కారం కానుంది. బదిలీలు కోరే ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కులాస్‌పూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసిన 11ఇళ్లలో చోరీ
- 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ.3.85లక్షల నగదు అపహరణ



కులాస్‌పూర్‌లోని చోరీ జరిగిన ఇంటిలో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్‌ సభ్యులు




గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌): మండలంలోని కులాస్‌పూర్‌ గ్రామంలో దోపిడీ దొంగలు బుధవారం అర్ధరాత్రి బీభత్సం సృష్టించారు. ఏకంగా తాళం వేసి ఉన్న 11 ఇళ్లల్లో దొంగతనానికి పాల్పడ్డారు. గ్రామంలో చోరీ జరిగిన ఇళ్లను సీపీ సాయి చైతన్య, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి గురువారం పరిశీలించి, బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ జడ్‌ సుస్మిత, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామంలోని తాళం వేసిన సుమారు 11 ఇళ్లను గురువారం ఉదయం స్థానికులు చూడగా, తాళాలు పగలగొట్టి ఉండటంతో ఒక్కొక్కరుగా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఐదారుగురి ఇళ్లల్లోనే నగదు, బంగారం, వెండి చోరీకి గురైనట్లు తెలిసింది. మిగతా వారి ఇళ్లల్లో చోరీకి యత్నించినా.. విలువైన వస్తువులు లేకపోవడంతో వెనుదిరిగారు. ఆయా ఇళ్ల నుంచి మొత్తం 7.3 తులాల బంగారం, 54 తులాల వెండి, రూ.3.85లక్షల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేశారు.

పిల్లులు పట్టేవారి పనేనా?

కులాస్‌పూర్‌లో గురువారం పిల్లులు పడతామని పలువురు గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలో సంచరించారు. ఈక్రమంలో వారే ఎవరికీ అనుమానం రాకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు తాళం వేసిన ఇళ్లను గమనించి రెక్కి నిర్వహించి, అర్ధరాత్రి చోరీకి పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సుమారు అర్ధరాత్రి 2 గంటల నుంచి 3 గంటల్లోపే నిందితులు ఒకేసారి 11 ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. సుమారు 10మందికిపైగా బృందాలుగా విడిపోయి గంటల వ్యవధిలోనే దొంగతనానికి పాల్పడటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మంకీ క్యాపులు ధరించి, మారణాయుధాలను కూడా వెంట తెచ్చుకున్నట్లు తెలిసింది. ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దొంగ పదునైన కత్తిని మర్చిపోగా, పోలీసులు దానిని స్వాధీనం చేసుకున్నారు.

ఘటన స్థలాన్ని సీపీ సాయి చైతన్య, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్‌ పరిశీలించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు 3 ప్రత్యేక బృందాలను నియమించారు. గడిచిన ఏడాది కాలంలో గ్రామంలో రెండుసార్లు దొంగతనాలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో ఐదారు ఇళ్లల్లో ఒకేరోజు చోరీ జరిగినా.. ఇప్పటివరకూ ఆ కేసులో పురోగతి లేదు.



క్రైం కార్నర్‌

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



గుమ్ముల రాజు (ఫైల్‌)

బాల్కొండ: మండల కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. బాల్కొండకు చెందిన గుమ్ముల రాజు(48) బైక్‌పై పాత బస్టాండ్‌ వైపు బయలుదేరాడు. ఎంఈవో కార్యాలయం ఎదుట రెండు ఎద్దులు ఘర్షణ పడుతూ బైక్‌పై వెళ్తున్న రాజును ఢీకొట్టాయి. ఈ ఘటనలో అతడు రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని నిజామాబాద్‌ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఇందల్వాయి: ఇందల్వాయి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నల్లవెల్లి గ్రామ శివారులో గల రైల్వేట్రాక్‌ పక్కన గల గుంతలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం వ్యక్తి మృతదేహం కనిపించినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్ల నుంచి 45ఏళ్ల లోపు ఉండవచ్చని తెలిపారు. అతడు తెలుపు చొక్కా, నలుపు రంగు పాయింట్‌ ధరించాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌ చోరీల కేసులో నిందితుల అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: తరచు బైక్‌ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు గురువారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌వో నరహరి వివరాలు వెల్లడించారు. పట్టణంలోని విద్యానగర్‌ కాలనీకి చెందిన జంగం నగేష్‌ తన బైక్‌ చోరీకి గురైనట్లు ఈ నెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు. పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా రెండు బైక్‌లపై వచ్చిన ఇద్దరు యువకులు పోలీసులను చూసిపారిపోబోయారు. వారిని పట్టుకుని విచారించగా బైక్‌ల చోరీలకు పాల్పడినట్లు తెలిసింది. నిందితుడు యూనిస్‌, మైనర్‌ బాలుడితో కలసి జంగం నగేష్‌ బైక్‌తో పాటు మరికొన్ని బైక్‌ లను చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి 5 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై రాజారాం, సిబ్బంది వినయ్‌, బాబయ్య, నర్సింలును అభినందించారు.